

జాతరకు ముస్తాబైన మల్లన్న పేట మల్లికార్జునస్వామి ఆలయం



మల్లికార్జున స్వామి వారి మూలవిరాట్


# మల్లన్న జాతర నేటి నుంచే..

- మల్లన్నపేటలో ఏర్పాట్లు పూర్తి చేసిన కమిటీ
- ముస్తాబైన స్వామి వారి ఆలయం
- వచ్చే నెల 10 వరకు ఉత్సవాల నిర్వహణ


గొల్లపల్లి, డిసెంబర్, 17: భక్తితో కొలిచే భక్తుల కొంగుబంగారమై వెలుగొందుతున్న దైవం మల్లన్నపేట మల్లికార్జున స్వామి. ఎంతో మహిమగల దేవుడిగా ప్రతీతి. కరీంనగర్‌కు ఉత్తరాన 62 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న గ్రామమైన మల్లన్నపేటలో వెలిసిన దైవం మల్లికార్జున స్వామి. జగిత్యాలకు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ద్వితల (రెండు అంతస్తుల ఆలయం) ఆలయంలో పరమశివుడు లింగం రూపంలో వెలిశాడు. గొల్ల కురుమల ఆరాధ్య దైవమైన మల్లికార్జున స్వామిని ఇక్కడి ప్రజలు దొంగమల్ల స్వామిగా, షష్ఠి మల్లన్నగా కొలుస్తుంటారు. చాళుక్య శిల్పకళా రీతుల్లో ఉన్న ఈ ఆలయం పొలాస రాజులచే పదకొండో శతాబ్దములో నిర్మించబడింది. ఈ ఆలయాన్ని పొలాస రాజులు తమ్మడి వారికి అప్పగించారు. అప్పడి నుంచి తమ్మడి వారి ఆధీనంలో ఉండగా, వారు ఫౌండర్ ట్రస్టీలుగా ఉంటూ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామంలో ఆలయం ఉన్నందువల్లే గ్రామాన్ని మల్లన్నపేటగా పిలుస్తుంటారు. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఈ గ్రామం పేరు తిర్మలాపురం (ఎమ్)గా ఉంటుంది. కాగా ప్రజల విన్నపం మేరకు ఈ ఏడాదిలోనే మంత్రి కొప్పుల ఈశ్వర్ గెజిట్ ద్వారా ఈ గ్రామం పేరును మల్లన్నపేటగా మార్చుతూ జీవో తీసుకువచ్చారు. అప్పటి నుంచి రెవెన్యూ రికార్డుల్లో మల్లన్నపేటగా మార్చారు.

## షష్ఠితో జాతర ప్రారంభం

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఈనెల 18 నుంచి జనవరి 10 వరకు జాతర నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. మార్గశిర మాస శుద్ధ పంచమి తర్వాత వచ్చే షష్ఠితో జాతర ఉత్సవాలు ప్రారంభం కావడంతో షష్ఠి మల్లన్న జాతరగా పిలుస్తారు. రెండు అంతస్తుల ఆలయంగా ఉండడంతో రెండు తలల ఆలయంగా పిలుస్తుంటారు. అంటే రెండంతస్తుల ఆలయాలు రాష్ట్రంలో అరుదుగా ఉన్నాయి. అందులో ఈ ఆలయం ఒక్కటి. ఈనెల 17న రాత్రి స్వామి వారి కల్యాణం, సోమవారం మహా దండి వారం జాతర ప్రారంభం, ఆ తర్వాత వచ్చే ప్రతీ బుధ, ఆది వారాల్లో, ఏడు వారాల పాటు జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య, కార్యనిర్వహణాధికారి విక్రమ్ తెలిపారు. స్వామివారికి బోనాలు తీయడం, పట్నాలు వేయడం, బెల్లం (బంగారం) తూకంతో మొక్కులు చెల్లించుకోవడం ఇక్కడి ప్రత్యేకత. స్వామివారికి ప్రీతిపాత్రమైన పరమాన్నం, బెల్లం అన్నంతో బోనాలు తీసి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. జాతరకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. మంచినీటి వసతి, బోనాలు వండుకోవడానికి స్థలాన్ని చదును చేశారు. జగిత్యాల టీఎస్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.



# మంచు వేళలో 'మత్స్య' వేట



ఒక వైపు చలి పంజా విసురుతోంది. ఉదయం 9 గంటలైనా తీవ్రత తగ్గడం లేదు. చల్లటి గాలులతో జనాలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. అయితే, కొందరు ఉపాధి కోసం తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తుంది. ఇందులో ప్రధానంగా మత్స్యకారులు. వారు తమ బతుకుదెరువు కోసం ఉదయం, సాయంత్రం వేళల్లోనే చేపల వేటకు వెళ్తుంటారు. ఇలా సుమారు 200 మంది కరీంనగర్ శివారులోని లోయర్ మానేరు డ్యాంలోకి వెళ్లి చేపలు పడుతారు. ఈ క్రమంలో శనివారం ఉదయం మంచు కురిసే వేళలో చేపల వేట కోసం మత్స్యకారులు ఇలా తెప్పలపై ప్రయాణం చేస్తుండగా 'నమస్తే' తన కెమెరాలో బంధించింది. - కరీంనగర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్



2544సంవత్సరాల క్రితం తొలి చారిత్రాత్మక యుగం నాటి మట్టి పాత్రలు, ఆట వస్తువులు, ఆభరణాలు



జిల్లాలోని తెలుకుంటలో లభ్యమైన క్రీస్తు శకం 4వ శతాబ్దం నాటి విష్ణుకుండినుల నాణేలు



పెద్దపల్లి కలెక్టరేట్ సముదాయం



వృక్ష శిలాజాలను అతికిస్తున్న చరిత్ర పరిశోధకులు

# చరిత్రకు జీవం..
# చారిత్రక వైభవం

## పెద్దపల్లి కలెక్టరేట్ లాబీలో నయా మ్యూజియం

- పురాతన వస్తువులు, వృక్ష శిలాజాలతో ఏర్పాటు
- కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ చొరవతో రూపుదిద్దుకున్న ప్రాంగణం
- త్వరలో మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభం
- ఆనందంలో చరిత్రకారులు



కోట్ల సంవత్సరాల క్రితం నాటి మొక్క శిలాజాలు





జిల్లాలోని పెద్దబొంకూరు, ధూళికట్టల్లో లభ్యమైన 2500 ఏండ్ల క్రితం నాటి శాతవాహన కాలానికి చెందిన నాణేలు



మ్యూజియంగా మార్చుతున్న కలెక్టరేట్ సమావేశ మందిర లాబీ



వివిధ కాలాల నాటి లిపిలు, అక్షర మాల

శతాబ్దాల చరిత్రకు దర్పణంగా పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నిలువబోతున్నది. జిల్లాలోని చరిత్రను ఒడిసిపట్టి భావితరాలకు తెలియజేసేలా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ప్రత్యేక చొరవతో ప్రత్యేకంగా మ్యూజియం ఏర్పాటైంది. చరిత్ర పరిశోధకులు, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్, జిల్లా ప్రజా సంబంధాల అధికారి ఆధ్వర్యంలో సేకరించిన ప్రాచీన, పూర్వ కాలం నాటి వస్తువులు, శిలాజాలు, పనిముట్లతోపాటు జిల్లా చరిత్ర, చారిత్రాత్మక ప్రదేశాలు, ఆలయాలు, ప్రాంతాల విశిష్టతను తెలియజేసేలా ఫొటోలు ఏర్పాటు చేశారు.

- పెద్దపల్లి, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ)

పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రధాన ప్రాంగణ సమావేశ మందిరం లాబీలో ప్రత్యేకంగా మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలో ఆదిమానవులు, శాతవాహనులు, కాకతీయుల కాలాలకు సంబంధించి సేకరించిన పనిముట్లు, వస్తువులు, వేల ఏండ్ల నాటి చేప, వృక్ష, ఆకు, జీవ శిలాజాలను ప్రదర్శనకు ఉంచారు. ముఖ్యంగా 180-65 మిలియన్ ఏండ్ల క్రితం నాటి చేప శిలాజాలు, 2544 ఏండ్ల క్రితం తొలి చారిత్రాత్మక యుగం నాటి మట్టి పాత్రలు, ఆట వస్తువులు, ఆభరణాలు, సూక్ష్మరాతి, పాతరాతి, కొత్తరాతి యుగం పనిముట్లు, 20 కోట్ల ఏండ్లనాటి వృక్ష శిలాజాలు, కోట్ల ఏండ్ల క్రితం నాటి మొక్క శిలాజాలు, సూక్ష్మరాతి యుగం రాతి పనిముట్లు, జిల్లాలోని పెద్దబొంకూరు, ధూళికట్టల్లో లభ్యమైన శాతవాహన కాలానికి చెందిన నాణేలు, జిల్లాలోని తేలుకుంటలో లభ్యమైన క్రీస్తు శకం 4వ శతాబ్దం నాటి విష్ణుకుండినుల నాణేలు, బ్రిటీషు కాలం నాటి నాణేలు, వివిధ కాలాల నాటి లిపిలు, అక్షరమాలను మ్యూజియంలో ప్రత్యేకంగా పొందుపరిచారు. ఈ మ్యూజియాన్ని త్వరలోనే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభా వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

### మరెన్నో చారిత్రాత్మక ప్రదేశాలు

ఆలయాలతోపాటు చారిత్రాత్మక ప్రదేశాల డిజిటల్ ఫొటోలను మ్యూజియంలో ప్రదర్శిస్తున్నారు. రామగిరి ఖిల్లా, దూళికట్ట బౌద్ధస్తూపం, మంథని మండలం ఖానాపూర్‌లోని మొసల్లమడుగు(ఎల్ మడుగు), రామగుండంలోని రాముని గుండాలు, సబ్బితం, పాండవలంక జలపాతాలు, కాల్వశ్రీరాంపూర్‌లోని వేద పాఠశాల, సుల్తానాబాద్ మండలంలోని మూడుజాముల కొదురుపాక, బసంత్‌నగర్‌లోని బుగ్గ గుట్ట, గుంజపడుగులోని కాసిపేట గుళ్లు, ఖమ్మంపల్లిలోని సందరెల్లి గుళ్లు ఇలా ఎన్నో ప్రదేశాల ఫొటోలను ఉంచారు. అలాగే గోదావరి బ్రిడ్జి, జిల్లాపరిధిలోని కాళేశ్వరం పంప్‌హౌస్‌లు, బ్యారేజీలు, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, పాలకుర్తి మండలం అటవీశాఖ పార్క్ ఇలా ఎన్నో చిత్రాలను పొందుపరిచారు.



జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాల ఫొటోలు

### ఆలయాల ఫొటోలు

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఆలయాల ఫొటోలను మ్యూజియంలో పొందు పరిచారు. ఓదెల మల్లికార్జున స్వామి, మంథనిలోని శ్రీ గౌతమేశ్వర స్వామి, మహాలక్ష్మి, భిక్షేశ్వరస్వామి, మహాగణపతి, కన్నాల వేంకటేశ్వర స్వామి, ముత్తారం గుట్టపై ముక్తేశ్వరస్వామి, రంగనాయక స్వాముల దేవాలయం, రాగినేడు శివాలయం, దేవునిపల్లిలో నృసింహస్వామి ఆలయం, నందిమేడారంలో అమరేశ్వర ఆలయం, త్రికూటాలయం, భారీ నంది విగ్రహం, ఖనిలోని జనగామ శివాలయం ఇలా ఆలయాల ఫొటోలను డిజిటలైజ్ చేసి ఇక్కడ ఉంచారు.

### వృక్ష, జంతు శిలాజాలు

పలు ప్రాంతాల్లో లభ్యమైన వృక్ష, జంతు శిలాజాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. అందుకు కలెక్టరేట్ గేట్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ఉన్న ప్రధాన రహదారి, పక్కన పార్క్‌లలో ప్రత్యేకంగా గద్దెలను నిర్మించి శిలాజాలను ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేస్తున్నారు.

### ఇదో గొప్ప అవకాశం



చరిత్రను భావితరాల వారు తెలుసుకునే విధంగా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ప్రత్యేక చొరవ తీసుకొని కలెక్టరేట్‌లో మ్యూజియాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయం. ఇందుకు అధికారులు, సిబ్బంది ఎంతగానో శ్రమించారు. దాదాపుగా పనులన్నీ పూర్తయ్యాయి. ప్రజలు సందర్శించి మన ప్రాంత గొప్పతనాన్ని తెలుసుకోవాలి.

- సముద్రాల సునీల్, చరిత్ర పరిశోధకుడు (బేగంపేట)

# పేదల నేస్తం..
# ఉచిత నేత్ర వైద్యం





కొదురుపాకలో బీసీఎం కంటి దవాఖాన

- కొత్తకాంతులు నింపుతున్న బీసీఎం వైద్యశాల
- రెండేండ్లలోనే 1065 మందికి ఉచిత శస్త్రచికిత్సలు
- సొంతూరులో సేవలందిస్తున్న డాక్టర్ రాజలింగం-రీటా బహదుర్ షా
- ఇప్పటివరకు 93 గ్రామాల్లో శిబిరాలు
- 9243 మందికి పరీక్షలతో మరింత చేరువ
- నేటితో మూడో వసంతంలోకి కంటి దవాఖాన

మసక బారిన కండ్లల్లో కొత్త వెలుగు ప్రసరిస్తోంది. ఆర్థిక స్థోమత లేక వైద్య పరీక్షలు నిర్వహించుకోలేని నిరుపేదలకు ఎంతో స్వాంతన కలుగుతున్నది. కొదురుపాకలోని బీసీఎం కంటి దవాఖాన భరోసాగా నిలుస్తున్నది. డాక్టర్ వైరాగ్యం రాజలింగం పుట్టిన గడ్డపై మమకారంతో తన తల్లిదండ్రులు బుచ్చమ్మ-చంద్రమౌళి స్మారకార్థం సరిగ్గా రెండేండ్ల క్రితం ఏర్పాటు చేసిన వైద్యశాల ఉచిత ఆపరేషన్లకు కేరాఫ్‌గా మారింది. దవాఖాన ప్రారంభించిన అతి తక్కువ టైంలోనే తన సతీమణి రీటా బహదూర్‌షాతో కలిసి ఏకంగా 1065 మందికి శస్త్రచికిత్సలు చేసి చూపును ప్రసాదించగా, సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ఇంకా చుట్టు పక్కల గల 93 గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి 9243 మందికి పరీక్షలతో పేదల వైద్యశాలగా మారిన బీసీఎం దవాఖాన నేటితో మూడో వసంతంలోకి అడుగుపెట్టబోతున్నది.

- బోయినపల్లి, డిసెంబర్ 17

కొదురుపాకకు చెందిన డాక్టర్ వైరాగ్యం రాజలింగం హైదరాబాద్‌లోని సరోజినీదేవీ కంటి దవాఖానలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన సతీమణి రీటా బహదూర్‌షా సైతం ఓ ప్రైవేట్ వైద్యశాలలో కంటి వైద్యనిపుణురాలిగా కొనసాగుతున్నారు. రాజలింగం పుట్టిన ఊరుపై మమకారం, తల్లిదండ్రులపై గౌరవంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులతోపాటు ఊరి జనానికి సేవ చేయాలని సంకల్పించారు. తల్లిదండ్రులు బుచ్చమ్మ-చంద్రమౌళి పేరిట 2021 డిసెంబర్ 18న గ్రామంలో బీసీఎం కంటి దవాఖానను ప్రారంభించారు. రెండంతస్తులలో సకల వసతులతో నిర్మించారు. ఇందులో కార్పొరేట్‌స్థాయి సౌకర్యాలను కల్పించారు. ఇందులో కంటి వైద్య నిపుణులు, ఆప్తామాలజిస్ట్, ఏఎన్‌ఎం, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఇక్కడ ఆదివారం మినహా నిత్యం కంటి వైద్య పరీక్షలు చేస్తారు. రూ.50 నామినల్ చార్జి మాత్రమే తీసుకుంటారు. ఆపరేషన్ అవసరం ఉన్నవారిని గుర్తిస్తారు. వీరికి ప్రతి 15 రోజులకోసారి ఆదివారం రాజలింగం- రీటా బహదూర్‌షా దంపతులు ఆపరేషన్లు చేస్తారు. అలాగే ప్రతి బుధవారం రీటాబహదూర్‌షా సేవలందిస్తారు. ఇలా కొదురుపాక వైద్యశాలలో ఇప్పటివరకు జిల్లానేకాదు కరీంనగర్ ఉమ్మడి జిల్లాతోపాటు సిద్దిపేట వాసులు 1065 మందికి ఫ్రీ ఆపరేషన్లు చేశారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైరాగ్యం రాజలింగం

### ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేవలు

బీసీఎం దవాఖాన ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు, కరీంనగర్, జగిత్యాల జిల్లాలోనూ సేవలందిస్తున్నారు. దవాఖాన వైద్యులతో తమ బృందంతో వెళ్లి నిత్యం ఏదో ఒక గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 93 గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, 9243 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు.

### కంటి వైద్యంలో ఎక్స్‌పర్ట్

కంటి వైద్య నిపుణులు డాక్టర్ వైరాగ్యం రాజలింగానికి ది బెస్ట్ డాక్టర్‌గా పేరుంది. లేజర్ (ప్యాకో) శస్త్రచికిత్సల నిర్వహణలో ఎక్స్‌ఫర్ట్. రెండేండ్ల క్రితం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభకు కంటి ఆపరేషన్ చేశారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు హైదరాబాద్‌లో కంటి శస్త్రచికిత్స చేశారు. విరసం నేత వరవరరావుకు గత నవంబర్ 3 కంటి ఆపరేషన్ చేశారు.



కంటి ఆపరేషన్ చేసుకున్న వృద్ధులు

### పేదల కండ్లలో కాంతులు నింపడమే లక్ష్యం



గ్రామీణ ప్రజలకు ఉచిత కంటి వైద్యసేవలందించడం, వారి కండ్లలో కాంతులు నింపడమే లక్ష్యం. అందుకే గ్రామంలో దవాఖాన ప్రారంభించా. ఇప్పటివరకు 1065 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయడం, దవాఖాన నేటితో రెండేండ్లు పూర్తి చేసుకొని మూడో వసంతంలోకి అడుగు పెడుతుండడం ఆనందంగా ఉంది. మున్ముందు ఇదే స్ఫూర్తితో ముందుకుసాగుతాం.

- డాక్టర్ వైరాగ్యం రాజలింగం, బీసీఎం కంటి దవాఖాన వ్యవస్థాపకుడు



హైదరబాద్‌లో మాజీ సీఎం సతీమణి శోభకు కంటి ఆపరేషన్ చేసిన రాజలింగం దంపతులు